సందడిగా ఆక్సిజన్ పార్కు



ఆక్సిజన్ పార్కులో వాకర్లు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం ఆక్సిజన్ పార్క్ వాకర్లతో సందడిగా మారుతుంది. సుమారు 56 ఎకరాల్లో అధికారులు వాకింగ్ ట్రాక్ తో పాటు పచ్చటి చెట్ల మధ్య గ్రీనరీ ఏర్పాటు చేశారు. దీంతో పార్కు చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులు పెద్ద ఎత్తున ఉదయం 5 గంటలకే అక్కడికి చేరుకొని వాకింగ్ చేస్తున్నారు. ఉదయం 11 గంటల వరకు ఈ ప్రాంతమంతా వాకర్స్ తాకిడితో జన సందోహంగా మారుతుంది. గతంలో ఇక్కడ పదుల సంఖ్యలో వాకింగ్ కోసం రాగా తాజాగా వీరి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది.

ఫ్లై ఓవర్‌కు పీజేఆర్ నామకరణం హర్షణీయం



పీజేఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

జగద్గిరిగుట్ట: గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌కు దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డి పేరు నామకరణం చేయడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పంతుల సాయికుమార్ పటేల్ అన్నారు. జగద్గిరిగుట్ట చౌరస్తా కూడలిలో పీజేఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ ప్రజలకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో లింగయ్య, యాదగిరి, పరశురాం, సామ్, యూత్ కాంగ్రెస్ నాయకులు అశోక్, శ్రావణ్, చరణ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం.. నో వర్కింగ్!



రంగారెడ్డినగర్: పని చేయని ఏటీఎంలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శ్‌నగర్ ఆర్చ్ పక్కనే ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం కేంద్రంలో మూడు ఏటీఎంలు ఉన్నాయి. వాటిలో రెండు ఏటీఎంలు మరమ్మతులకు రాగా మరో ఏటీఎం మాత్రమే పని చేస్తోంది. అయితే ఉన్న ఒక్క ఏటీఎంలో సైతం డబ్బులు రావడం లేని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఏటీఎం కేంద్రాల నిర్వహణకు వేలాది రూపాయలు వెచ్చిస్తున్నా సేవలు అందించడంలో బ్యాంక్ అధికారులు విఫలమవుతున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటీఎంలు పని చేయకపోవడంతో డబ్బులు విత్‌డ్రా కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మూలన పడ్డ ఏటీఎంలకు మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తేవాలని బ్యాంక్ వినియోగదారులు కోరుతున్నారు.

వెండి ఆభరణాలు చోరీ

దుండిగల్: ఇంటి తాళాలు పగలగొట్టి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దుండిగల్ డీఐ సతీష్ వివరాల ప్రకారం.. మల్లంపేట కేవీఆర్ లేవుట్‌లోని ప్రణీత్ నేచర్ బౌంటీలోని 157 విల్లాలో శ్రీనివాస్, 158లో ఉషశ్రీ కుటుంబాలు నివసిస్తున్నాయి. శ్రీనివాస్ కుటుంబం నెల రోజుల క్రితం కతార్, ఉషశ్రీ కుటుంబం 15 రోజుల కిత్రం అమెరికాకు వెళ్లారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వీరి ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం వీరి ఇళ్లను శుభ్రం చేసే పని మనిషి వచ్చి దొంగతనం జరిగిందన్న విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు తెలిపింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. శ్రీనివాస్ ఇంట్లో కిలోన్నర వెండి, ఉషశ్రీ ఇంట్లో 8 తులాల వెండి, ఐదు గ్రాముల బంగారం దొంగతనానికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. నలుగురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు సీసీ ఫుటేజీ ఆధారంగా తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు రోడ్డు పాలు !

- గోదావరి జలాల పైపులైన్‌కు లీకేజీ
- నాలుగు గంటల పాటు వృథాగా నీరు
- పైపులైన్ వాల్వ్‌ల బంద్
- పరిసర ప్రాంతాలకు నిలిచిన నీటి సరఫరా



అక్జోనోబుల్ పరిశ్రమ వద్ద రోడ్డుపై పారుతున్న తాగునీరు

చింతల్: గోదావరి జలాల ప్రధాన పైపులైన్‌ల నిర్వహణ లోపించడంతో తరచూ ఏదో ఒక చోట లీకేజీలు తలెత్తుతున్నాయి. దీంతో వందలాది కిలో మీటర్ల నుంచి నగరానికి తీసుకువచ్చిన తాగునీరు రోడ్డు పాలవుతోంది. షాపూర్‌నగర్‌లోని జగద్గిరి గుట్ట రిజర్వాయర్ల నుంచి బాలానగర్‌కు వెళ్లే 800 డయా పైపులైన్‌కు ఆదివారం ఉదయం బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలోకి వచ్చే అక్జోనోబుల్ పరిశ్రమ వద్ద లీకేజీ ఏర్పడింది. దీంతో సుమారు నాలుగు గంటల పాటు తాగునీరు రోడ్లపై వృథాగా పోయింది. బాలానగర్ చౌరస్తా నుంచి చింతల్ వైపు వచ్చే వాహనాలకు నీటి ప్రవాహంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వాటర్ వర్క్స్ లైన్‌మెన్‌లు ఉదయం 10 గంటలకు పైపులైన్ వాల్వ్‌ను బంద్ చేయడంతో నీటి వృథాకు అడ్డుకట్ట పడింది. దీంతో బాలానగర్ పరిసర ప్రాంతాలైన ఫతేనగర్, ఫిరోజ్‌గూడ, బాలానగర్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డు మార్గంలో తరచూ పైపులైన్‌లు, మ్యాన్‌వాల్వ్‌ల లీకేజీలు షరామామూలుగా మారాయని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



అక్జోనోబుల్ పరిశ్రమ వద్ద లీకేజీ

బీఆర్‌ఎస్ కోవర్టుగా మారి కాంగ్రెస్‌ని దెబ్బతీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

- అధికారంలో ఉన్నామన్న భ్రమలో గులాబీ నేతలు
- వారి ఆటలు సాగనివ్వం
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీకి చక్కటి క్యాడర్ ఉందని, బీఆర్‌ఎస్‌కు కోవర్టుగా మారి పార్టీని దెబ్బ తీయొద్దని కొంతమంది కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. శనివారం మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై జరిగిన దాడి విషయమై ఆదివారం దూలపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వమే అధికారంలో ఉందనే భ్రమలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు రెచ్చిపోతున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక చరిత్ర ఉందని, అనవసరంగా మా పార్టీ కార్యకర్తల చేతికి పని చెప్పొద్దని సూచించారు. సమాజానికి నాలుగో పిల్లర్ మీడియా అని, అలాంటి మీడియా సంస్థలపై దాడులు సరైంది కాదన్నారు. ఎంతో మంది ఫోన్లను ట్యాపింగ్ చేసి వ్యక్తిగత విషయాలను తెలుసుకోవడం దుర్మార్గమన్నారు. సమావేశంలో కార్యక్రమంలో డీసీసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, నక్క ప్రభాకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గరిసే నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్: గాజులరామారం చౌరస్తాలో రోడ్డు వైడ్‌నింగ్ పనుల క్రమంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్యభార్గవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాజులరామారం క్రషర్స్, 11కేవీ మహదేవపురం ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్స్, గాజులరామారం మహారాజా గార్డెన్స్ లేన్, వల్లభా రెసిడెన్సీ, గాజులరామారం గ్రామం, వేంకటేశ్వర గార్డెన్స్ లేన్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గురుపూజ మహోత్సవం

మోతీనగర్: దేశానికి అవసరమైన త్యాగం, సేవ, సమర్పణ అనే ఈ మూడు గుణాలను రాష్ట్రీయ స్వయం సేవ కల్పించిందని మానవీయ నగర సంఘ్ డాక్టర్ ఎస్.కే. జశ్వాల్ అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్రీయ సంస్థ మధురానగర్ శాఖ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారత మాత చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

12న ఐటీ ఉద్యోగులకు అవగాహన

రాయదుర్గం: ఐటీ ఉద్యోగుల కోసం గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో జూలై 12వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. శాంతిసరోవర్ క్యాంపస్‌లోని ఇన్నర్‌స్పేస్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'ఇన్నర్ ఎక్సలెన్స్ రీట్రీట్' పేరిట 'ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి మనస్సును పునఃప్రారంభించడం'పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సమావేశంలో ముంబాయికి చెందిన అంతర్జాతీయ వక్త, కార్పొరేటర్ ట్రైనర్ బి.కె. శ్రేయ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం గాజులరామారంలోని శ్రీచిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కొండడి యాదవరావుకు రూ.60 వేలు, కడలి సత్యనారాయణకు రూ.37 వేలు, భల్లం ఉషారాణికి రూ.35 వేలు, విజయరామరాజుకు రూ. 32,500, విశల్‌కు రూ.60 వేల చొప్పులు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ పండ్ పథకంతో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

సెయింట్ మార్టిన్స్ కళాశాలలో ఒలంపియాడ్ డే



డాక్టర్ ఎస్.మల్లారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

సుభాష్‌నగర్: మేడ్చల్ జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఒలంపియాడ్ డే ను నిర్వహించారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలను తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ పోటీల్లో 325 మంది క్రీడాకారులు రన్నింగ్, లాంగ్ జంప్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలను నిర్వహించేందుకు సెయింట్ మార్టిన్స్ యాజమాన్యం సహకరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ వేదిక అన్ని వయస్సుల క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఉపయుక్తం కానుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సెయింట్ మార్టిన్స్ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలి



సమావేశమైన ఇళ్లు కోల్పోతున్న యజమానులు

సుభాష్‌నగర్: రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి మార్కెట్ రేటు ప్రకారం ప్రభుత్వం పరిహారం చెల్లించాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ బూర్గుబావి సత్యనారాయణ అన్నారు. దూలపల్లి ప్రధాన రోడ్డు 100 ఫీట్ల విస్తరణ విషయమై శనివారం కొంపల్లి మున్సిపల్ అధికారులు 121 మందికి నోటీసులను అందజేశారు. వారం రోజుల్లో ఖాళీ చేయాలని, వాటిని తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నారు. దీంతో బాధితులు ఆదివారం దూలపల్లిలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు కనీసం మూడు నెలల గడువు ఇవ్వకుండా కేవలం వారం రోజులే గడువు ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. మార్కెట్ రేటు ప్రకారం డబ్బులు చెల్లించకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



మురుగు.. పరుగు

కుత్బుల్లాపూర్: పద్మానగర్ ఫేజ్ 1, రోడు నెంబర్ 12లో వారం రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. దుర్వాసనతో ఇక్కడి నుంచి వెళ్లే వాళ్లు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇండ్ల మధ్యలో దుర్వాసన రావడంతో పాటు దోమలు కూడా ఎక్కువయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

- బీఆర్‌ఎస్ పాలనలో శివారు ప్రాంతాలు అభివృద్ధి
- బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ బృందావన్ కాలనీలో రూ.91 లక్షలతో అభివృద్ధి పరిచిన పార్కును కార్పొరేటర్ తారాచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో శివారు ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఇప్పటికే బందావన్ కాలనీలో మిషన్ భగీరథ ద్వారా మంజీరా నీటి సదుపాయం, వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాలనీ వాసులంతా ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని, బృందావన్ కాలనీ అభివద్ధి తన బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిగౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రమణకుమార్‌రాజు, కోశాధికారి జోగారావు, సంయుక్త కార్యదర్శి నవీన్, కార్యనిర్వాహక కార్యదర్శి వంశీ, బీఆర్‌ఎస్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మహిళా నాయకురాలు శ్రీదేవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

సామాజిక సేవలతో ఆర్యవైశ్యులకు గుర్తింపు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సామాజిక కార్యక్రమాల ద్వారా ఆర్యవైశ్యులు తమదైన ముద్ర వేశారని, ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ మండల ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం గాజులరామారం సత్యగౌరి కన్వెన్షన్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2010లో జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘానికి 2 వేల గజాల ప్రభుత్వ స్థలాన్ని ఇప్పిచ్చానని గుర్తు చేశారు.



కమిటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వాస శ్రీనివాసులుగుప్తా, కార్యదర్శి దారం ఇంద్రాసేనగుప్తా, కోశాధికారి సోమిశెట్టి పవన్‌కుమార్‌గుప్తా, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బి.రమేష్ గుప్తా, వివిధ డివిజన్లకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి



కొలన్ హన్మంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం నేతలు

దుండిగల్: స్థానిక సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి పరిధిలోని మల్లికార్జున నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివారం కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్లను వేయించాలని కోరగా.. అధికారులతో మాట్లాడి వెంటనే నిధులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, ముత్యం రెడ్డి, సంజీవ రెడ్డి, శివ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి

కుత్బుల్లాపూర్: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం జీడిమెట్ల డివిజన్ వేంకటేశ్వర కాలనీ వెస్ట్‌లోని హనుమాన్ టెంపుల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజు, కాలనీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఫస్ట్ ఎవెన్యూ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రాఘవేంద్ర కాలనీ అధ్యక్షుడు నారాయణ, బీజేపీ నాయకులు శ్రీశైలం, మహేష్, ఓబయ్య, శంకర్, సిద్ధిరాములు, రవీందర్, వీరారెడ్డి, నార్లకంటి ప్రతాప్ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

'రైతు సంక్షేమం' ఎక్కడ ?

కొంతమంది రైతులకే రైతు భరోసా

- అందరికీ అమలు కానీ రుణమాఫీ
- మేడ్చల్ జిల్లాలో రైతు పరిస్థితి అగమ్య గోచరం

మేడ్చల్: జిల్లాలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు అందరికీ అందడం లేదు. మేడ్చల్ సహా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, ఉప్పల్, నియోజకవర్గాలు ఉండగా.. మేడ్చల్ నియోజకవర్గంలో మెజారిటీ రైతులు భూములను సాగుచేస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రైతులు ఉన్నా.. కొంత మేరకు సాగు ఉంది. మిగతా నియోజకర్గాలు హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్నాయి.

బోనస్ పడలే..

సన్న వడ్లు పండించిన రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు రూ.500 కలిపి బోనస్ ఇస్తామని ప్రకటించినా.. స్థానిక రైతులకు ఇంత వరకు బోనస్ సొమ్ము ఖాతాలలో జమ కాలేదు.

◆ మేడ్చల్ జిల్లాలో గత సీజన్‌లో అధికారులు 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 3,253 టన్నుల సన్న వడ్లు, 13,453 టన్నుల దొడ్డు వడ్లను కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 3,253 టన్నుల సన్న వడ్లను కొనుగోలు చేయగా.. క్వింటాల్‌కు రూ.2,320 బోనస్ రూ.500 కలిపి రూ.2,820 అకౌంట్లలో జమ కావాల్సి ఉండగా.. బోనస్ మినహాయించి రూ.2,320 మాత్రమే అధికారులు జమ చేశారు. ప్రభుత్వం ఇస్తామని చెబుతున్న బోనస్ రూ.500 ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదు.



రైతు భరోసాకు నోచుకోని రైతులు..

మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 49,000 వేల మంది రైతులు ఉండగా.. అందరూ రైతులు ప్రభుత్వం రైతు భరోసాకు నోచుకోవడం లేదు. తొలి విడతలో కేవలం మూడు చింతలపల్లి మండలానికి చెందిన 4,291 మంది రైతులకు రైతుభరోసా వచ్చింది. రైతులు, రైతు నాయకుల నిరసనలు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 20,507 మంది రైతులకు రైతు భరోసా నిధులు వారి అకౌంట్లలో మంగళవారం జమ చేశారు.

◆ తాజాగా ఇప్పటి వరకు మొత్తం 24,798 మంది రైతులకు రైతు భరోసా నిధులు ఇచ్చి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేసింది. జిల్లాలో 49 వేల మంది రైతులు ఉండగా.. 24,202 మంది రైతులు ఇప్పటి వరకు రైతు భరోసాకు నోచుకోవడం లేదు. జిల్లాలో సగం మంది రైతులకు రైతుభరోసా లేకపోవడంతో రైతులు ప్రభుత్వ పెద్దల మాటలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీ కొందరికే..

జిల్లా వ్యాప్తంగా 49 వేల మంది రైతులు ఉండగా అందులో సగం మంది రైతులు బ్యాంకులు, రైతు సహకార సంఘాల ద్వారా రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్నా.. అందరికి రుణమాఫీ కాలేదు. జిల్లాలో కేవలం 4,371 మంది రైతులకు మాత్రమే ఇప్పటి వరకు రుణమాఫీ అయ్యింది. ఔటర్‌కు దగ్గరగా ఉన్న రైతులను ధనిక రైతులనే సాకుతో వారికి రాష్ట్రంలో మిగతా ప్రాంతాల రైతుల మాదిరిగా రైతు భరోసా ఇవ్వకపోవడంపై మేడ్చల్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బోనస్ త్వరలోనే వస్తుంది

జిల్లాలో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రభుత్వం నుంచి తప్పకుండా వస్తుంది. రైతుల ఖాతాల్లో త్వరలోనే బోనస్ డబ్బులు జమ అవుతాయి. సన్న వడ్ల రైతుల వివరాలు ఇప్పటికే ఉన్నతాధికారులకు అందజేశాం.

– సుగుణబాయి, డీఎం పౌరసరఫరాల శాఖ

అందరికీ రైతు భరోసా

జిల్లాలో రైతు భరోసా పొందడానికి అర్హత ఉన్న ప్రతీ రైతుకు రైతు భరోసా నిధులు మంజూరు అవుతాయి. పంటలు సాగు చేస్తున్న రైతుల ఖాతాల్లోకి డబ్బులు వస్తాయి.

– చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి